ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..

Q6 NEWS తెలుగు

మేడ్చల్ | సోమవారం | 03.08.2026 | సంపుటి : 2 | సంచిక : 32 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు






## బోనమెత్తిన లష్కర్

### ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి

### పూజలు చేసిన మంత్రులు, ఇతర ప్రముఖులు

చరిత్రాత్మకమైన లష్కర్ బోనాలు అంగరంగ వైభవంగా జరిగాయి. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతరకు వేలాది మంది తరలి వచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారుజాము నుంచి పెద్ద ఎత్తున క్యూలైన్లలో వేచి ఉన్నారు. జాతర సందర్భంగా వేకువజామున 4.05 గంటలకు నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు అమ్మవారికి బోనం, పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాధారణ భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు అవకాశం కల్పించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 12.45 గంటలకు అమ్మవారిని దర్శించుకుని పట్టువస్త్రాలు సమర్పించారు.

## డ్రగ్స్‌తో జీవితాలు నాశనం

### మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయాలి

### యువతకు ప్రధాని మోదీ పిలుపు

### 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్' ప్రారంభం

మాదక ద్రవ్యాల వినియోగం వల్ల తాత్కాలికంగా ఉత్సాహం కలిగినప్పటికీ అవి వృత్తి, వ్యక్తిగత జీవితాలను పూర్తిగా నాశనం చేస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయాలని యువతకు పిలుపునిచ్చారు. 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని ఆయన ఆదివారం ఢిల్లీలో వర్చువల్‌గా ప్రారంభించారు.

న్యూఢిల్లీ, ఆగస్ట్ 2 : యువత మానసికంగా, శారీరకంగా దృఢంగా, ఆరోగ్యంగా ఉండాలని.. ఇందుకోసం అన్ని రకాల మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండటం అవసరమని పేర్కొన్నారు. శత్రు దేశాలు తమ ఉగ్రవాద ప్రణాళికల్లో భాగంగా మాదక ద్రవ్యాల సరఫరాను ఒక ఆయుధంగా వాడుతున్నాయని ఆరోపించారు. డ్రగ్స్ వ్యసనం నుంచి బయటపడే వారు పోరాట యోధులని, సమాజం వారిని గౌరవించాలని

-మిగతా 2 లో..





## ఉత్సవాల నిర్వహణకు బిచ్చమెత్తుకోవాలా?

### రంజాన్‌కు రూ.33 కోట్లు, బోనాలకు రూ.20 కోట్లా..?

### ప్రభుత్వంపై మండిపడ్డ బండి సంజయ్

హైదరాబాద్, ఆగస్ట్ 2 : రాష్ట్రంలో హిందూ పండగలు, ఉత్సవాల నిర్వహణ కోసం ప్రభుత్వాన్ని అర్థించే పరిస్థితి నెలకొందని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘనంగా నిర్వహించాల్సిన ఉత్సవాల విషయంలో రాష్ట్రప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. బోనాల పండగ సందర్భంగా ఆదివారం సికింద్రాబాద్

-మిగతా 2 లో..

## ఇంజినీర్లను క్రిమినల్ వేస్ట్ అంటారా?

### రేవంత్ రెడ్డి చేత క్షమాపణ చెప్పించాల్సిన బాధ్యత రాహుల్ గాంధీదే

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఇంజినీరింగ్ విద్యార్థులను సీఎం రేవంత్ రెడ్డి అవమానించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ విషయమై రాహుల్ గాంధీకి లేఖ రాశారు.



హైదరాబాద్, ఆగస్ట్ 2 : ఇంజనీరింగ్ విద్యార్థులతో పాటు, ఇంజినీర్లను "క్రిమినల్ వేస్ట్" అనడం ఏంటని దేశ అభివృద్ధికి కీలకంగా పనిచేస్తున్న ఇంజినీర్లను అవమానించడం సరికాదన్నారు. ఈ వ్యాఖ్యలపై రేవంత్ రెడ్డి చేత క్షమాపణ చెప్పించాల్సిన బాధ్యత రాహుల్ గాంధీదేనని కేటీఆర్ స్పష్టం చేశారు. కేటీఆర్ మాట్లాడుతూ.. "ఒకవేళ రాహుల్ మౌనం వహించడం అంటే రేవంత్ వ్యాఖ్యలను సమర్థించినట్లే విద్యార్థులు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులకు కాంగ్రెస్ పార్టీ తరఫున రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలోనూ విద్యార్థులపై రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ యువత కాంగ్రెస్ హామీల మోసాన్ని గుర్తుంచుకుంటుంది రేవంత్ వెంటనే విద్యార్థులు, గురువులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 251 (కిలో) |
| స్కిన్ లెస్ | 284 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹86

## కృష్ణమ్మ పరుగులు

### శ్రీశైలంలో పెరుగుతున్న నీటిమట్టం

### ఎగువ నుంచి తరలివస్తున్న కృష్ణమ్మ



హైదరాబాద్, ఆగస్ట్ 2 : శ్రీశైలానికి కృష్ణా ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. కర్ణాటకలోని ఆలమట్టి, నారాయణపూర్‌ల నుంచి కృష్ణమ్మ తరలివస్తూనే ఉంది. రోజుకు 12 టీఎంసీలకు పైగానే జలాశయంలో నిల్వ పెరుగుతోంది. ఆలమట్టికి 1.03 లక్షల క్యూసెక్కులు వస్తుండగా దిగువకు 1.11 లక్షల క్యూసెక్కులు వదులుతున్నారు. నారాయణపూర్‌కు 1.11 లక్షల క్యూసెక్కులు వస్తుండగా అంతే మొత్తం వదులుతున్నారు. జూరాల వద్ద 1.56 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

-మిగతా 2 లో..

## సీజేపీ భవిష్యత్ కార్యాచరణ

### ఆగస్టు 5న కీలక సమావేశం




న్యూఢిల్లీ, ఆగస్ట్ 2 : కాక్రోచ్ జనతా పార్టీ తదుపరి కార్యాచరణపై దృష్టి సారించింది. పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే నివాసంలో (మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్) ఈ నెల 5న కోర్ కమిటీ సమావేశం జరగనుంది. వాలంటీర్లు, విద్యార్థుల అభిప్రాయాలను సేకరించి సమావేశానికి రావాలని సభ్యులు నిర్ణయించు కున్నారు. ఈ ఉద్యమాన్ని క్షేత్రస్థాయికి ఎలా

-మిగతా 2 లో..

## డ్రగ్స్‌తో జీవితాలు నాశనం

(మొదటిపేజీ తరువాయి)



సూచించారు. చుట్టూ ఉన్న సమాజం తోడ్పాటు, యోగా, ధ్యానంతో మాదక ద్రవ్యాల వ్యసనం నుంచి సులభంగా బయటపడవచ్చని మన సంస్కృతి బోధిస్తుందని ప్రధాని మోదీ తెలిపారు. 'నషా ముక్త్ యువ'కార్యక్రమం అనేది వ్యక్తి, కుటుంబం, సమాజం, అన్నింటికంటే ముఖ్యంగా దేశం పట్ల ఒక సంకల్పం అని చెప్పారు. ఈ కార్యక్రమం పేరులోనే దాని ఉద్దేశం ప్రతిబింబిస్తోందని అన్నారు. 'అభివృద్ధి చెందిన భారతదేశం'మన లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఇలాంటి తరుణంలో శారీరకంగా, మానసికంగానూ ఆరోగ్యంగా ఉంటూ ఆత్మవిశ్వాసంతో నిండిన యువత మనకు అవసరమని స్పష్టంచేశారు. డ్రగ్స్ వల్ల తలెత్తే దుష్పరిమాణాలపై అవగాహన పెంచుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని కోరారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయాలని చెప్పారు. నేటి నుంచే దేశవ్యాప్తంగా నషా ముక్త్ యువ అభియాన్ ప్రారంభమవుతోందని, ఇది ఒక సామూహిక ఉద్యమంగా మారినప్పుడు, మాదక ద్రవ్యాల నుంచి దేశానికి విముక్తి లభిస్తుందని వివరించారు. ఈరోజు తీసుకున్న సంకల్పం రాబోయే 100 వారాల పాటు ఇదే రీతిలో కొనసాగుతుందని పేర్కొన్నారు. రాబోయే 100 ఆదివారాలు 'డ్రగ్స్ రహిత భారత్'దిశగా 100 బలమైన అడుగులు పడబోతున్నాయని వెల్లడించారు. ఒక చెడు వ్యసనం కేవలం శరీరాన్నే కాకుండా, తల్లి చిరునవ్వును దూరం చేస్తుందని, తండ్రి కలలను ఛిద్రం చేస్తుందని, సోదరి ఆశలను బలహీనపరుస్తుందని, తమ్ముడి గౌరవాన్ని హరిస్తుందని వ్యాఖ్యానించారు. తమ కళ్ల ముందే తమ పిల్లలు క్రమంగా తమను తాము కోల్పోతుండటం చూస్తూ కుటుంబ సభ్యులు ప్రతిరోజూ వేదనతోనే జీవిస్తుంటారని అన్నారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా సాగుతున్న ఈ పోరాటంలో ప్రభుత్వం యువతకు అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణాదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రధానమంత్రి మోదీ ప్రకటించారు. గతంతో పోలిస్తే అరెస్టుల సంఖ్య గణనీయంగా పెరిగిందని అన్నారు. రూ.వేల కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మాదక ద్రవ్యాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందన్నారు. సామాజికంగా పరువు ప్రతిష్టలకు భయపడి పిల్లల వ్యసనాలను దాచవద్దని, దానికి బదులుగా వారితో స్వేచ్ఛగా మాట్లాడాలని, వ్యసనం నుంచి బయటపడేందుకు నిపుణుల సహాయం లేదా వైద్య సాయం పొందాలని మోదీ సూచించారు. యువత మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండేలా ప్రోత్సహించడం, వారు సమాజంలో సానుకూల సామాజిక మార్పుకు రాయబారులుగా మారేలా చేసేందుకు ప్రభుత్వం 'నషా ముక్త్ యువ'ను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా ప్రతి ఆదివారం పలు కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇందులో క్రీడలు, వాకథాన్‌లు, ధ్యానం, సాంస్కృతిక కార్యక్రమాలు, అవగాహన ప్రచారాలు, వీధి నాటకాలు, చర్చా వేదికలు, కళల పోటీలు, సామాజిక భాగస్వామ్య కార్యక్రమాలు ఉంటాయి. నషా ముక్త్ భారత్(వ్యసన రహిత భారత్)ను నిర్మించాలన్న ప్రధానమంత్రి దార్శనికతకు అనుగుణంగా 'నషా ముక్త్ భారత్ అభియాన్'ను ప్రారంభించినట్లు కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయా వెల్లడించారు.





# బోనమెత్తిన లష్కర్

**హైదరాబాద్:** చరిత్రాత్మకమైన లష్కర్ బోనాలు అంగరంగ వైభవంగా జరిగాయి. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతరకు వేలాది మంది తరలి వచ్చారు. అమ్మవారిని దర్శించుకునేం దుకు భక్తులు తెల్లవారుజాము నుంచి పెద్ద ఎత్తున క్యూలైన్లలో వేచి ఉన్నారు. జాతర సందర్భంగా వేకువజామున 4.05 గంటలకు నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు అమ్మవారికి బోనం, పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాధారణ భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు అవకాశం కల్పించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 12.45 గంటలకు అమ్మవారిని దర్శించుకుని పట్టువస్త్రాలు సమర్పించారు. ఆయనతో పాటు మంత్రి కొండా సురేఖ అమ్మవారికి బోనం సమర్పించగా మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క పాల్గొన్నారు. అంతకుముందు స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు, ఆలయ చైర్మన్ కామేష్, ఈవో గుత్తా





మనోహర్‌రెడ్డి సీఎంకు స్వాగతం పలికారు. రాజ్యసభ సభ్యులు పవన్‌ఖేరా, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేష్, నవీన్‌యాదవ్ తదితరులు సీఎం వెంట ఉన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి కూడా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్‌రావు, హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నందా, ప్రభుత్వ సలహాదారులు వి.హన్మంతరావు, వేణుగోపాల్, జిల్లా కలెక్టర్ ఆల ప్రియాంక, నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

### బోనాలు విశ్వవ్యాప్తం చేసిన ఘనత కేసీఆర్‌దే: కేటీఆర్

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే బోనాల జాతరను విశ్వవ్యాప్తం చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుంది. తల్లి ఆశీర్వాదంతోనే తెలంగాణ సాధించాం. అమ్మకు ఇచ్చిన మాట ప్రకారం కేసీఆర్ బోనాల ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించారు. వర్షాభావ పరిస్థితులు తొలగిపోయి వర్షాలు బాగా కురవాలి, రైతులందరూ సంతోషంగా ఉండాలని మొక్కుకున్నా.



## ఉత్సవాల నిర్వహణకు బిచ్చమెత్తుకోవాలా?

(మొదటిపేజీ తరువాయి)

ఉజ్జయిని మహాకాళి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ.. "ప్రభుత్వం బోనాలను రాష్ట్ర పండగగా.. ప్రకటించి వదిలేసింది. ఆ మేరకు నిధులివ్వాలనే ఆలోచనే లేదు. రంజాన్ పండగ నిర్వహణకు రూ.33 కోట్లు ఇచ్చిన ప్రభుత్వం.. 80% పైగా ఉన్న హిందువుల బోనాల ఉత్సవాలకు రూ.20 కోట్లు మాత్రమే ఇవ్వడం ఏమిటి? సాక్షాత్తు ముఖ్యమంత్రే 'కాంగ్రెస్ అంటే ముస్లిం.. ముస్లిం అంటే కాంగ్రెస్' అని అన్నారు. అందుకే హిందూ పండగలపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. బోనాలు, గణేశ్ ఉత్సవాలకు జనాభా నిష్పత్తి ప్రాతిపదికన నిధులు కేటాయించాలి" అని డిమాండ్ చేశారు.



## కృష్ణమ్మ పరుగులు

నమోదవుతుండగా దిగువకు 1.52 లక్షల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో శ్రీశైలం జలాశయం నీటిమట్టం ఆదివారం సాయంత్రం 6 గంటలకు 849.70 అడుగులకు చేరింది. మరోవైపు గోదావరిలో ప్రవాహం నెమ్మదించింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 10,358 క్యూసెక్కులు వస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో నిల్వ 31.92 టీఎంసీలకు (పూర్తి నిల్వ 80.5 టీఎంసీలు) చేరుకుంది. కడెం నుంచి 4 వేల క్యూసెక్కులు విడుదలవుతుండగా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 8,326 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. దిగువకు అంతే మొత్తం విడుదల చేస్తున్నారు. సుందిళ్లకు 3 వేల క్యూసెక్కులు, అన్నారానికి 11 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అంతే మొత్తం మేడిగడ్డ వైపునకు విడుదల చేస్తున్నారు. ప్రాణహిత, గోదావరి ప్రవాహాలు కలిపి మేడిగడ్డకు 5.52 లక్షల క్యూసెక్కులు వస్తున్నాయి. సమ్మక్కసాగర్ బ్యారేజీకి 5.54 లక్షల క్యూసెక్కులు వస్తుండగా అంతే దిగువకు వదులుతున్నారు. భద్రాచలం ఎగువన ఉన్న సీతమ్మసాగర్ బ్యారేజీ వద్ద 8.53 లక్షల క్యూసెక్కుల ప్రవాహం నమోదయింది. భద్రాచలం వద్ద రెండు రోజులు ఉధృతంగా ప్రవహించిన గోదావరి శాంతించింది.

## వికసిత భారత్ సాధనలో ఈవీ రంగం కీలకం

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి




**హైదరాబాద్:** వికసిత భారత్ సాధనలో ఎలక్ట్రిక్ వాహన రంగం కీలకమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ క్లబ్‌లో టీజీఆర్టీసీ వైస్‌ఛైర్మన్, ఎండీ నాగిరెడ్డి, కీటో మోటార్స్ లిమిటెడ్ డైరెక్టర్ వెంకటేశ్ చల్లాతో కలిసి కిషన్‌రెడ్డి కీటో మోటార్స్ మొదటి ఎలక్ట్రిక్ బస్సును, ఇథనాల్ ఆధారిత విద్యుత్ జనరేటర్‌ను ఆదివారం ప్రారంభించారు. అంతకుముందు కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. 'విద్యుత్ వాహనాలతోపాటు వ్యాక్సిన్ తయారీ వంటి ఎన్నో రంగాల్లో ప్రపంచంతో మనం పోటీపడుతున్నాం. తయారీ రంగం, గ్రీన్‌ఎనర్జీ, ఇన్నోవేషన్‌లతోపాటు అన్ని రంగాల్లో రాణిస్తున్నాం. ఫలితంగా భారత్ అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడుతోంది. అరుదైన ఖనిజాల విషయంలోనూ స్వయం సమృద్ధి సాధించేలా కేంద్రం పని చేస్తోంది. ప్రస్తుతం బొగ్గుతోనే 73 శాతం విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాం. దీన్ని తగ్గించాలని చూస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో భూగర్భ కోల్ గ్యాసిఫికేషన్ విప్లవం తీసుకురాబోతున్నాం. ఈ ఏడాది రూ.లక్ష కోట్లతో పనులు చేపట్టనున్నాం. తెలంగాణలో ఉపరితల కోల్ గ్యాసిఫికేషన్ చేపట్టబోతున్నాం' అని మంత్రి తెలిపారు. నాగిరెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీసీ ప్రస్తుతం 1050 ఎలక్ట్రిక్ బస్సులు నడిపిస్తోందని, పీఎం ఈ డ్రైవ్ కింద 2,200 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని తెలిపారు. కీటో మోటార్స్ లిమిటెడ్ డైరెక్టర్ వెంకటేశ్, కిషన్‌రెడ్డి సతీమణి కావ్య, కీటో గ్రూప్ ఛైర్మన్ ప్రసాద్, ట్రాన్ ఎనర్జీ టెక్నాలజీ సీఈవో అలెన్ తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ నెల 10న సాధారణ నెలవారీ పన్ను వాటాతోపాటు అదనంగా రూ.1,09,019 కోట్ల పన్నుల వికేంద్రీకరణ నిధులను రాష్ట్రాలకు విడుదల చేయనుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణకు అదనంగా రూ.2,370 కోట్లు అందనున్నాయన్నారు. ఇది రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాలకు ఎంతో తోడ్పడుతుందని చెప్పారు.

## సీజేపీ భవిష్యత్ కార్యాచరణ.. ఆగస్టు 5న కీలక సమావేశం

(మొదటిపేజీ తరువాయి)

తీసుకెళ్లాలి, విద్యార్థులపై నమోదైన కేసుల ఉపసంహరణ విషయమై కేంద్రంపై ఎలా ఒత్తిడి తీసుకురావాలనే అంశాలపై ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది. అనంతరం విలేకరుల సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నారు. ఇదిలా ఉండగా స్నేహితుల దినోత్సవం సందర్భంగా చిన్నారులతో కలిసి దీప్కే ఆదివారం వేడుకలు నిర్వహించారు నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వివాదం నేపథ్యంలో ఎన్‌టీఏ పరీక్షల భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తోంది. ప్రధాన కార్యాలయం, ప్రాంతీయ కార్యాలయాలు, సర్వర్ గదులు, స్ట్రాంగ్‌రూమ్‌లు, ప్రశ్నపత్రాల నిల్వ కేంద్రాలకు 24 గంటల భద్రత కల్పించేందుకు సుమారు రూ.7.5 కోట్లతో టెండర్‌ను ఆహ్వానించింది. రెండేళ్ల పాటు అమలయ్యే ఈ ఒప్పందానికి ఆగస్టు 17 వరకు బిడ్లు స్వీకరించనుంది. భద్రతతో పాటు హౌస్‌కీపింగ్, సెక్యూర్ ప్రింటింగ్ (అత్యంత సురక్షితంగా ప్రశ్నపత్రాల ముద్రణ) కోసం టెండర్లను ఆహ్వానిస్తోంది.



## భారత సరిహద్దుల్లో చైనా ఫిరంగులు

### 72 కిలోమీటర్ల వరకు దాడికి అవకాశం

**న్యూఢిల్లీ:** భారత్‌తో సరిహద్దుల వెంబడి తమ సైనిక కార్యకలాపాలను పాకిస్తాన్ ఉధృతం చేస్తోంది. ఫిరంగి సామర్థ్యాలను గణనీయంగా పెంచుతోంది. ఇందులో భాగంగా చైనాలో తయారైన 250 ఎస్‌హెచ్--15 ట్రక్--మౌంటెడ్ సెల్ఫ్--ప్రొపెల్డ్ హోవిట్జర్ ఫిరంగులను మోహరించిందని నిఘా వర్గాలు వెల్లడించాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం పాకిస్థాన్ సైన్యం భారత్‌తో ఉన్న తన తూర్పు సరిహద్దు వెంబడి ఉత్తరం నుండి దక్షిణం వరకు కీలక ప్రాంతాల్లో 155 ఎంఎం ఫిరంగి వ్యవస్థలను మోహరించడం ప్రారంభించింది. ఇటీవలి కాలంలో ఇస్లామాబాద్ చేపట్టిన అత్యంత ముఖ్యమైన ఫిరంగి దళాల మోహరింపు కార్యక్రమాల్లో ఇది కూడా ఒకటి. పహల్గాం ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా భారత సైన్యంచేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' తర్వాత తన సాయుధ దళాలను ఆధునీకరించే ప్రయత్నాలను పాకిస్తాన్ ముమ్మరం చేసింది. ఇందులో భాగంగానే చైనా నుంచి అత్యాధునిక శతఘ్నులను సమకూర్చుకుంటున్నట్లు తెలుస్తోంది. చైనాకు చెందిన ప్రభుత్వ రంగ రక్షణ సంస్థ 'నోరింకో' ఈ ఫిరంగులను ఉత్పత్తి చేస్తోంది. వీటిని సరిహద్దుల్లో మోహరించడం ద్వారా భారత భూభాగంలో 72 కిలోమీటర్ల దూరం వరకు దాడి చేసే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. మరోవైపు పాకిస్తాన్, చైనా మధ్య రక్షణ బంధం నానాటికీ బలపడుతోంది. పాకిస్తాన్‌కు చైనా పెద్ద ఎత్తున ఆయుధాలు సరఫరా చేస్తోంది.



## భీమారం బోనాల వేడుకల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు

**షాద్‌నగర్, ఆగస్టు 2 (జనంవార్త) :** జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఫరూఖ్‌నగర్ మండలం భీమారం గ్రామంలో నిర్వహించిన బోనాల మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రవీందర్ యాదవ్ పాల్గొని గ్రామ దేవత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ ఆత్మను, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే విశిష్టమైన పండుగ అని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గీత వీరేశం, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మండల అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, మాజీ సర్పంచులు రవి గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, దశరథ్, నాయకులు ప్రేమ్ కుమార్ గౌడ్, లోకేష్, బాలరాజు, భీమారం గ్రామ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో



## 37 ఏళ్ల విశిష్ట సేవలకు ముగింపు

### ఎస్ఐ లక్కాకుల రాజేశ్వర్‌కు ఘన సన్మానం

**షాద్‌నగర్, ఆగస్టు 2 (జనంవార్త) :** పోలీసు శాఖలో 37 సంవత్సరాలపాటు విశిష్ట సేవలందించి ఇటీవల పదవీ విరమణ పొందిన ఎస్ఐ లక్కాకుల రాజేశ్వర్‌కు కోకా ఫామ్‌లో ఘన సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ సీనియర్ జర్నలిస్టు లక్కాకుల రమేష్ కుమార్ శాలువాతో సత్కరించి ఆయన సేవలను అభినందించారు. ఫరూక్‌నగర్‌కు చెందిన లక్కాకుల రాజేశ్వర్ 1989లో రంగారెడ్డి జిల్లా పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. ఆయన తొలి నియామకం ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌లో జరిగింది. విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో పనిచేస్తూ మొత్తం 14 పోలీస్ స్టేషన్లలో సేవలందించారు. సుదీర్ఘ సేవలకు గుర్తింపుగా 2024లో సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందిన ఆయనకు షాద్‌నగర్‌లో పోస్టింగ్ లభించింది. 37 ఏళ్ల సుదీర్ఘ పోలీసు సేవలను విజయవంతంగా పూర్తి చేసి, 61 ఏళ్ల వయస్సులో 2026 జూలై 25న పదవీ విరమణ పొందారు. ఈ సన్మాన సభలో పోలీసు అధికారులు, సహచర సిబ్బంది, కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొని రాజేశ్వర్ సేవలను కొనియాడారు. ఆయన భవిష్యత్ జీవితం ఆరోగ్యంగా, ఆనందంగా, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.



## షాద్‌నగర్‌లో భక్తిశ్రద్ధలతో బోనాల సంబరాలు

### అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్

**షాద్‌నగర్, ఆగస్టు 2 (జనంవార్త) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల పండుగను షాద్‌నగర్ పట్టణంలో ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ పట్టణంలోని 7వ, 12వ, 26వ వార్డుల్లో నిర్వహించిన పోచమ్మ బోనాల ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు చైర్మన్‌కు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి, సంస్కృతికి ప్రతీక అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, కౌన్సిలర్ పెంటయ్య మురళీమోహన్ (అప్పి), దిలీప్ కుమార్, కొప్పునూరి ప్రవీణ్, బచ్చలి నరేష్, చందూలాల్, ముబారక్ అలీ ఖాన్, గంగమోని సత్తయ్య, జయప్రకాశ్, నాగమణి, మంజుల, సాయి వంశీ బొట్టు రాజు, సాయి కిరణ్ తదితర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బోనాల శోభాయాత్రలు, డప్పు వాయిద్యాలు, సాంప్రదాయ నృత్యాలతో షాద్‌నగర్ పట్టణం ఆధ్యాత్మిక వాతావరణంలో కళకళలాడింది



## ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

### శ్రీషిర్డీ సాయిబాబాను దర్శించుకున్న హరికృష్ణ

**ఎల్బీనగర్,ఆగస్టు 2 (జనంవార్త) :** ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు అని విజయవాడ ఇంద్రకీలాద్రి ధర్మకర్తల మండలి సభ్యులు తాళికోట హరికృష్ణ అన్నారు.శ్రీ సాయిబాబా కృపా కటాక్షంతో రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఎల్బీనగర్ లో మెల్లం శ్రీనివాస్ ఆహ్వానం మేరకు శ్రీషిరిడి సాయిబాబా ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం తాళికోట హరికృష్ణను శాలువాతో ఘనంగా సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,అర్చక స్వాములు,భక్తులు, స్థానిక ప్రముఖులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.





# ఉజ్జయిని మహంకాలమ్మను దర్శించుకున్న కేటీఆర్

### కేటీఆర్,పద్మారావు లకు లస్కర్ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపిన పండాల శివ కుమార్ గౌడ్

**సికింద్రాబాద్,ఆగస్టు 2(జనంవార్త) :** ఉజ్జయిని మహంకాళి అమ్మవారి లష్కర్ బోనాల వేడుకలకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై స్థానిక ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ తో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా అమ్మవారి సుభిక్షతో రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని,రైతులకు సమృద్ధిగా పంట రావాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సికింద్రాబాద్ శ్రీమహంకాళి అమ్మ బోనాల పండుగ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆహ్వానం మేరుకు ఆయన నివాసానికి కేటిఆర్ రావడంతో చర్లపల్లి డివిజన్ సీనియర్ నాయకులు పండాల శివ కుమార్ గౌడ్,బిఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు పద్మారావు కుమారులు రామేశ్వర్ గౌడ్,త్రినేత్ర గౌడ్ స్వాగతం పలికి బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో కేటిఆర్ విందు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,నాగారం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు గూడూరు మహేష్ గౌడ్,జనగామ జిల్లా నాయకులు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్, లింగాల భరత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## శేరిలింగంపల్లి రాజకీయాలపై కేటీఆర్‌తో చర్చ..

### సైకత శిల్పం చిత్రపటాన్ని అందించిన చిర్రా రవీందర్ యాదవ్

**శేరిలింగంపల్లి, ఆగస్టు 2(జనం వార్త):** భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)ను శేరిలింగంపల్లి ఉద్యమ నాయకుడు చిర్రా రవీందర్ యాదవ్ ఆదివారం నందినగర్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఒడిశాలోని పూరీ సముద్ర తీరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సైకత శిల్పానికి సంబంధించిన చిత్రపటాన్ని, బర్త్‌డే ఫ్రేమ్‌ను కేటీఆర్‌కు అందజేశారు. సమావేశంలో సైకత శిల్పం రూపకల్పన, దాని ప్రత్యేకత గురించి చిర్రా రవీందర్ యాదవ్ కేటీఆర్‌కు వివరించారు. శిల్పకళ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం వినూత్నంగా ఉందని కేటీఆర్ అభినందిస్తూ, రవీందర్ యాదవ్ చేసిన కృషిని ప్రశంసించారు. సృజనాత్మకతతో పార్టీ పట్ల అభిమానాన్ని చాటుకోవడం అభినందనీయమని పేర్కొన్నట్లు తెలిపారు. అనంతరం శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై ఇరువురి మధ్య విస్తృతంగా చర్చ జరిగింది. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడానికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, యువతను మరింతగా ఆకర్షించే వ్యూహాలపై రవీందర్ యాదవ్ తన అభిప్రాయాలను కేటీఆర్




దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చిర్రా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మార్గదర్శకత్వంలో శేరిలింగంపల్లిలో భారాసను మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. నాయకులు పార్టీలు మారినా భారాసకు ప్రజల్లో ఉన్న ఆదరణ ఏమాత్రం తగ్గదని, యువ నాయకత్వం ఆధ్వర్యంలో పార్టీ మరింత శక్తివంతంగా ముందుకు సాగుతోందని అన్నారు. జెన్-జీ ఆశయాలకు అనుగుణంగా పార్టీని ప్రజలకు మరింత చేరువ చేస్తూ, వచ్చే ప్రతి ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

## వాటర్ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని కలిసిన కాంగ్రెస్ నేత బలరామ్ యాదవ్

**శేరిలింగంపల్లి, ఆగస్టు 2(జనం వార్త):** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యతో పాటు అమ్మవారి ఆలయ నిర్మాణానికి సంబంధించిన అంశాలపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బలరామ్ యాదవ్ ఆధ్వర్యంలో కాలనీ ప్రతినిధులు, పెద్దలు, యువకులు కలిసి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీని ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే వాటర్ వర్క్స్ మేనేజర్ సందీప్‌తో ఫోన్‌లో మాట్లాడి ప్రతిరోజూ ఉదయం వేళల్లో నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని, అలాగే నీటి విడుదల సమయాన్ని కొంత





పెంచాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను సూచించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా కాలనీలో నిర్మించనున్న అమ్మవారి ఆలయానికి సంబంధించిన అంశాలను కూడా ఎమ్మెల్యేతో చర్చించారు. ఆలయ నిర్మాణానికి సంబంధించి ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి అవసరమైన సహకారం అందించే విషయాన్ని పరిశీలిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, యువకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తమ సమస్యలను పరిష్కరించేందుకు సహకరించిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి, అలాగే కాలనీ ప్రజలందరికీ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బలరామ్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.



## గీతం యూనివర్సిటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి సన్మానం

**కూకట్‌పల్లి, ఆగష్టు 2, (జనం వార్త) :** నగరంలోని గీతం యూనివర్సిటీలో ఎం.టెక్ డేటా సైన్స్ విభాగంలో మొదటి ర్యాంక్ సాధించి విశిష్ట ప్రతిభ కనబరిచిన రాజరాజేశ్వరి ని వసంతనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి అభినందించారు. ఆదివారం సాయిబాబు చౌదరి కార్యాలయంలో వసంతనగర్ డివిజన్‌కు చెందిన కుమారి అగ్నిమండల రాజరాజేశ్వరి ని సాయిబాబు చౌదరి శాలువ కప్పి ఘనంగా సన్మానించి, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సాయిబాబు చౌదరి మాట్లాడుతూ గీతం యూనివర్సిటీ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ప్రతిభను గుర్తించి, విశాఖపట్నం లోక్‌సభ సభ్యులు, గీతం యూనివర్సిటీ ప్రెసిడెంట్ మతుకుమిల్లి భరత్, ప్రముఖ సినీ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి గోల్డ్ మెడల్, మెమెంటో, ప్రతిభా సర్టిఫికెట్ అందజేశారన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.



## హైదర్‌నగర్‌లో ఘనంగా స్నేహితుల దినోత్సవ వేడుకలు

**కూకట్ పల్లి, ఆగష్టు 2, ( జనం వార్త ) :** హైదర్‌నగర్ డివిజన్‌లోని ఎస్ఎల్‌వి ప్రో బ్యాడ్మింటన్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవ వేడుకలను ఆదివారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు.స్నేహబంధాల విలువను చాటిచెప్పేలా సభ్యులందరూ ఒకేచోట చేరి ఆత్మీయంగా వేడుకలలో పాల్గొని ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా సభ్యులందరూ కలిసి కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ స్నేహం అనేది జీవితాంతం నిలిచే అపురూపమైన బంధమని, కష్టసుఖాల్లో అండగా నిలిచే నిజమైన స్నేహితులే మనిషికి అసలైన ఆస్తి అని పలువురు సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. వేడుకల్లో పాల్గొన్న సభ్యులు స్నేహానికి ప్రతీకగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుతూ సంతోషకరమైన క్షణాలను ఆస్వాదించారు. ఈ వేడుకలలో విష్ణు యాదవ్, అజయ్ చింతల, చంద్రశేఖర్, కేశవరావు, సాయి, నరేష్, నరహరి, రమేష్, నాగరాజు యాదవ్, శశికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జనం వార్త




సమాచారం పంచుకునేందుకు ఒకప్పుడు పావురాలతో లేఖలు పంపించుకునేవారు. తర్వాత తపాలా వ్యవస్థ.. మరి ఇప్పుడు ? సామాజిక మాధ్యమాలు.. సోషల్ మీడియా అంతా ఒకెత్తయితే వాట్సాప్ ఒక్కటి ఒక్కెత్తు... అందులో స్టేటస్ అయితే చెప్పనవసరం లేదు. వందలో తొంబై మంది పని ఉదయం లేవగానే వాట్సాప్ స్టేటస్లు చెక్ చేయడం, పోస్ట్ చేయడం... సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడానికి సోషల్ మీడియా ఇప్పుడొక వేదికగా మారింది. అందులో ఇటీవల కాలంలో వాట్సాప్ యాప్ లోని ఫీచర్ అయిన స్టేటస్ ను ఉపయోగించుకుంటున్న వారి సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ఆధునిక టెక్నాలజీకి అలవాటు పడ్డ ఈ తరుణంలో స్టేటస్లో పోస్టు పెట్టడమనేది ఒక స్టేటస్ భావిస్తున్నవారూ ఉన్నారు. ఫేస్బుక్, యూట్యూబ్, ఎక్స్ మాధ్యమాలు ఉన్నప్పటికీ ఎక్కువగా వాట్సాఫ్ స్టేటస్ వేదికగా వాడుకుంటున్నారు.



# నేనూ.. నా స్టేటస్

- వాట్సాప్ స్టేటస్ మనోభావాలు వ్యక్తీకరణ
- అక్కడే సూక్తులు.. పరోక్షంగా విమర్శనాస్త్రాలు
- అధిక శాతం భక్తి సంబంధిత విషయాలు పోస్టులు
- వ్యాపార ప్రకటనలకు అదే మార్గం
- వ్యక్తిగత ప్రతిభ చాటి చెప్పేందుకు సైతం...
- స్టేటస్ ను విస్తృతంగా వాడుతున్న ప్రజలు

మాట.. పాట.. ఆట.. ఆనందం.. ఆశ్చర్యం.. విషాదం వార్తలు.. విశేషాలు.. వింతలు... శుభాకాంక్షలు.. విమర్శలు.. సూచనలు విద్య, ఉద్యోగం... వ్యాపారం... పుట్టుక.. పెళ్లి.. చావు.. ఆధ్యాత్మికం.. విహారం.. ఆరోగ్యం.. ఇలా అన్నీ ఒకే వేదికపై అందరితో స్మార్ట్ గా పంచుకుంటున్నారు. 'నా స్టేటస్.. నా ఇష్టం'.. అంటూ రోజూ అందరినీ పలకరిస్తూ సాగిపోతున్నారు. ఇలా వారు పెట్టిన పోస్టుకు ఎవరూ స్పందించకపోతే తీవ్ర అసంతృప్తికి గురయ్యే వారూ ఉన్నారు. ఈ క్రమంలో అందుకు అనుగుణమైన సందేశాన్ని కోట్ చేస్తూ పోస్టు చేస్తున్నారు. మొత్తంగా వాట్సాప్ స్టేటస్ లో వారు పోస్టు చేసే దాన్ని బట్టి వారు ఎలాంటి వారు, వారి మనస్తత్వమేమిటో ఇట్టే చెప్పేయవచ్చని మేధావులు అభిప్రాయపడుతున్నారు. వాట్సాప్ స్టేటస్ స్మార్ట్ఫోన్లు వాడుతున్న వారిలో 90 శాతం మందికి స్టేటస్ పెట్టడం దినచర్యలా మారింది. ఒక్కొక్కరు ఒక్కోలా స్టేటస్ పెడుతుంటే మరికొందరు అసలు స్టేటస్ పెట్టకూడదనే కృత నిశ్చయంతో దాన్నే పాటిస్తున్నారు. ఒకరు రోజుకు ఒక స్టేటస్ పెడుతుంటే, మరొకరు జరిగే చిన్న విషయాన్ని అందరితో పంచుకుంటూనే ఉంటారు. మితంగా ఉన్నంత వరకు అన్ని బాగానే ఉంటాయి. అతి కాకుండా అప్రమత్తతతో వ్యవహరించాలని, మానవ సంబంధాలు పెంచుకునేందుకు వాట్సాప్ స్టేటస్ ను ఉపయోగిస్తే సమాజంలో మన స్టేటస్ సైతం పెరుగుతుందనేది నిపుణులు చెబుతున్నారు.




## వాట్సాప్ స్టేటస్ ట్రెండ్

ప్రస్తుతం సమాజంలో నడుస్తున్న ట్రెండ్ ఏంటో తెలుసా ? బాధొచ్చిందా వాట్సాప్ స్టేటస్, సంతోషం వచ్చిందా వాట్సాప్ స్టేటస్. ఎటైనా ట్రిప్ వెళ్లారా వాట్సాప్ స్టేటస్, ఎవరిపైనా కోపం వచ్చిందా మళ్లీ వాట్సాప్ స్టేటస్. యువత లవ్ బ్రేకప్ అయినా కూడా వాట్సాప్ స్టేటసే స్నేహితుడిలా సాంత్వన కోరుకుంటోంది. వాట్సాప్ ఇంతగా మన జీవితాల్ని పెనవేసుకున్న సమయంలో మంచి చెడుల మిశ్రమంగా సాగుతోన్న స్టేటస్ కథ ఇది. మేడ్చల్ మండలంలో జనాభా దాదాపు లక్ష వరకు ఉంటుంది. అందులో పిల్లలు మినహాయిస్తే 80 వేల వరకు యుక్త వయస్సు నుంచి వృద్ధుల వరకు ఉంటారు. వీరిలో కనీసం 50 శాతం మందికి అంటే 80 వేల మందికి స్మార్ట్ఫోన్లు అందుబాటులోకి వచ్చాయి. దాదాపుగా స్మార్ట్ఫోన్లు ఉన్న ప్రతి ఒక్కరూ వాట్సాప్ ఉపయోగిస్తున్నారు. వాట్సాప్ లు ఉపయోగించే వారందరూ స్టేటస్లో వారికి నచ్చిన అంశాలను పోస్టు చేస్తూ ఉండటం లేదా చూస్తూ ఉండటం చేస్తున్నారు. ఐదేళ్ల క్రితం వరకు వాట్సాప్ యాప్ ను ఉపయోగించే వారిలో 10 నుంచి 20 శాతం మాత్రమే స్టేటస్ ఫీచరు ఉపయోగించేవారు. ఇప్పుడు 80 శాతం మంది ఈ ఫీచర్ ను చూస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు రోజులో నాలుగైదు సార్లైనా స్టేటస్ చూడందే నిద్రపోవడం లేదని సమాచారం. వారు పెట్టిన పోస్టును ఎవరు ? ఎంత మంది చూశారు ? ఎవ్వరైనా ప్రతి స్పందించారా ? అని అతృతగా వెతికేవారూ అధికమే.




## మనోభావాలు వ్యక్తం చేస్తూ...:

వాట్సాప్ స్టేటస్ మనిషి మానసిక స్థితిని ప్రభావితం చేయడమే కాదు. వ్యక్తి పరిస్థితికి అద్దం పట్టేదిగా మారుతోంది. కొందరు వారి మనోభావాలను తెలియజేసే విషయాలు ఎంపిక చేసుకుని స్టేటస్ లో పోస్టు చేస్తూ ఆనందిస్తున్నారు. ఇవి నచ్చిన వారికి మంచిగా నచ్చని వారికి చెడుగా కనిపించవచ్చు. చాలామంది ప్రతిరోజు దేవుళ్ల స్టేటస్ పెడుతుంటారు. ఒక్కోరోజు ఒక్కో దేవుడికి ప్రత్యేకంగా స్టేటస్ వేదికగా పూజలు చేస్తుంటారు. మనోభావాలు ఏవైనా వెంటనే వాటిని వ్యక్తపరిచేందుకు వాట్సాప్ స్టేటస్ ను ఎంచుకుంటున్నారు. ఏ పండుగైనా, సన్నిహితుల ప్రత్యేక రోజుల్లోనూ వాట్సాప్ స్టేటస్ శుభాకాంక్షలకు వేదికవుతోంది. అలాగే ఏదైనా సాధించినప్పుడు మనవాళ్లు ఎవరైనా ప్రతిభ కనబర్చినప్పుడు ఆ విషయాన్ని పదిమందికి చేర్చేందుకు, ప్రతిభకు పట్టం కట్టించేందుకు సైతం వాట్సాప్ స్టేటస్ సాయపడుతోంది. అయితే వాట్సాప్ స్టేటస్ పెట్టడమే హోదాగా భావించే వాళ్లు వారు అనుకున్న రీతిలో లైక్లు, కామెంట్లు రాకుంటే మాత్రం అసంతృప్తికి సైతం గురవుతున్నారు. ఆయా పరిస్థితుల్లో వారి మానసిక స్థితిగతులు బట్టి స్టేటస్ పెడుతున్నారని వ్యక్తిత్వ వికాస నిపుణులు, డాక్టర్లు వివరిస్తున్నారు.

## దేవుళ్లు.. దేవతలు...:




వాట్సాప్ స్టేటస్ చాలా ఉపయోగాలు ఉన్నప్పటికీ 50శాతం మంది ఏ రోజుకు ఆ రోజు సంబంధిత దేవుళ్ల ఫొటోలు, పాటల వీడియోలు పోస్టు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. వీటిని చూసిన ఆదేరకమైన వారు ప్రతిస్పందిస్తూ లైక్లు, కామెంట్లు పెడుతున్నారు. మరికొందరు ప్రతిస్పందిస్తూ ఒకే తెలిపే చిత్రాలను పోస్టు చేస్తున్నారు. హిందువులు ఆయా రోజు ప్రత్యేకతను బట్టి దేవుళ్ల గురించి పోస్టు పెడుతున్నారు. ముస్లింలు, క్రిస్టియన్లు అయితే రోజుతో సంబంధం లేకుండా ప్రతిరోజూ వారి మత సంబంధ కోట్స్ పోస్టు చేస్తున్నారు.

## అప్రమత్తత అవసరం..:

బాధ సంతోషమే కాదు... కోపాన్ని సైతం ప్రదర్శిస్తున్నారు. పనిచేసే చోట వ్యక్తులతో, బంధువులతో మనస్పర్థలు వచ్చినా వ్యంగంగా విమర్శనాస్త్రాలు సంధిస్తుంటారు. అంతేగాక విజ్ఞానానికి సంబంధించినవి, రాజకీయానికి సంబంధించిన అంశాలతో పాటు వివిధ అంశాలకు సంబంధించి అవగాహన కల్పించేలా సైతం ఉపయోగిస్తున్నారు. అలాగే వ్యాపార ప్రకటనలకు సైతం వాట్సాప్ స్టేటస్ వేదికవుతోంది. తమ తమ వ్యాపారాలకు సంబంధించిన పోస్టర్లు, లింక్ లతో తెరపైకి వస్తుంటారు నిర్వహకులు. అయితే నిర్వాహకులకు తెలియకుండానే కొన్నిసార్లు సైబర్ నేరగాళ్లు లింక్ల రూపంలో వచ్చే అవకాశం ఉందని, ఫొటోలు మార్ఫింగ్ చేసే అవకాశం ఉందని, కాస్త అప్రమత్తత అవసరమని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు.

### మీ స్టేటస్ ఇతరులు చూడకుండా ఉండాలంటే..? :

మీరు ఇతరుల వాట్సాప్ స్టేటస్లు చూడాలని అనుకుంటున్నారు అంతవరకు ఓకే. కానీ ఇతరులు ఎవ్వరూ మీ స్టేటస్ చూడకుండా ఉండాలంటే... అప్పుడు ఏం చేస్తారు. దీనికి కూడా ఓ పరిష్కారం ఉంది. మన వాట్సాప్ స్టేటస్ ను గుర్తు తెలియని వ్యక్తులు లేదా అన్ వాంటెడ్ వ్యక్తులు ఎవ్వరూ చూడకుండా ఉండాలంటే.. ముందుగా కాంటాక్ట్ లిస్ట్ నుంచి వారి ఫోన్ నంబర్లను డిలీట్ చేయండి. లేదా వారి నంబర్లను బ్లాక్ చేయండి... అంతే సింపుల్ !






# టీ కొట్టు... గిరాకీ పట్టు

## టీ స్టాల్స్ ఏర్పాటుపై ఆసక్తి చూపుతున్న యువత

- హైవేలు, ప్రధాన రహదారుల్లో మంచి సిట్టింగ్‌తో ఏర్పాటు
- మోడ్రన్గా, హైక్లాస్ హంగులతో నిర్వాహణ
- అందుబాటులో సంపూర్ణ ఆరోగ్యానికి అన్ని రకాల టీలు
- నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్న టీ డే
- ఉద్యోగాల వేట కాదు.. ఉపాధి బాట పట్టిన యువతరం

**గతంలో చాయ్ వాలా అంటే చిన్న చూపు చూసేవారు. కానీ ఒక్కసారి మన ప్రధాని నరేంద్ర మోదీ చరిత్రను తెలుసుకున్న వారెవరూ అలాంటి ఆలోచన దరిచేరనివ్వరు. చాయ్ వాలా నుంచి దేశ ప్రధానిగా జనం గుండెల్లో నిలిచి గెలిచారు. ప్రస్తుతం మేడ్చల్ పురపాలక సంఘం పరిధిలో టీ దుకాణాలు వెలుస్తున్నాయి. రకరకాల వెరైటీలతో ఇతర రాష్ట్రాల ఫ్రాంచైజీలు తీసుకొని యువత ప్రత్యేక టీ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఉద్యోగాల వేట మానేసి జీవనోపాధి పొందుతూ పలువురికి ఉపాధి కల్పిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు.. నేటి ఆధునిక యుగంలో తల్లిదండ్రులకు భారంగా మారిన పిల్లలు, మరోవైపు అసాంఘిక శక్తులుగా మారుతున్న యువతకు ఆదర్శంగా నిలుస్తున్న యువతపై ప్రత్యేక కథనం.**

చాయ్ అంటే నదు చీప్ గా చూసేవారు... అదే చాయ్ నేడు ఖరీదుగా మారింది.. కలర్ఫుల్ కప్స్.. రంగురంగుల షామియానాల్లో ప్రపంచ ప్రకృతి సౌందర్యాలన్ని ఏర్చి కూర్చి ఒకే చోట రంగులద్దుకుంటున్నాయి లేటెస్ట్ ట్రెండింగ్ టీ స్టాల్స్.. టీ అలవాటు లేని వారు కూడా టీ తాగుదామన్న స్థాయిలో ఆకర్షణీయంగా ప్రధాన రహదారులు పట్టణ ప్రాంతాల్లో టీ డే, టీ వనం, చాయ్ వాలా, బెల్లం టీ, చాయ్, మిస్టర్ టి, బాక్స్ టీ, ఇరానీ చాయ్ టీ.. రకరకాల బ్రాంచీలు తమిళనాడు, కేరళ, ఆంధ్ర రాష్ట్రాల ద్వారా మేడ్చల్ మండలంలో చాయ్ కొట్లు వెలిశాయి. సగటున ఒక్కో మండలంలో పదులకు పైగా టీ ఫ్రాంచేజీల పేరుతో మండల వ్యాప్తంగా వందకు పైగా లేటెస్ట్ ట్రెండింగ్ టీ స్టాల్స్ ను ఏర్పాటు చేసుకున్నారు యువత. ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలపై ఆధారపడకుండా సొంతంగా దీర్ఘకాలిక ప్రణాళికలతో రూ.మూడు లక్షలతో మొదలుకొని రూ.10 లక్షల దాకా పెట్టుబడి పెట్టి చిన్న, మధ్యతరహా భారీ స్థాయి టీ స్టాల్ ను ఏర్పాటు చేసుకొని యువత నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం పెరిగిన కొద్దీ స్మార్ట్ ఫోన్లు అంతర్జాలంలో కూరుకుపోయిన యువత, చెడు అలవాట్లకు బానిసై చదువులు చదవక ఉద్యోగాలు చేయక ఇటు సమాజానికి కుటుంబాలకు తల్లిదండ్రులకు భారంగా మారిన నేటి తరంలో చాయ్ వాలా రూపంలో నిర్మొహమాటంగా మా బ్రతుకుతెరువు ఆత్మగౌరవంతో బతుకుతాం అంటూ ఆదర్శమైన జీవిత ప్రయాణాన్ని ప్రారంభించారు మేడ్చల్ మండలంలోని పలువురు యువత.






### బెల్లం టీ స్టాల్ :

మండల పరిధిలో టిఫిన్ సెంటర్లు భోజనశాలలకు రెట్టింపు స్థాయిలో లేటెస్ట్ ట్రెండింగ్ టీ కొట్టులు విస్తరించాయి. బెల్లం టీ పేరుతో సైతం టీ స్టాల్స్ అడుగడుగునా వెలిశాయి. బెల్లం టీ కాఫీ తదితర పదార్థాలు సేవించడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సిద్ధించడంతో పాటుగా శారీరక రుగ్మతలు దరి చేరవని సైన్స్ చెబుతోంది. బెల్లం ఛాయ్ తాగడం వల్ల కలిగే ప్రయోజనాలకు సంబంధించి టీ కొట్లలో పూర్తిస్థాయిలో రాతపూర్వకంగా అందరికీ టి యొక్క ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తూ యువత సామాజిక బాధ్యతను కూడా పోషించడం సర్వత్ర హర్షణీయం. రాబోయే తరాలకు నేటితరం సగటు యువత చాయ్ వాలా ఆషామాషీ కాదు ఆత్మగౌరంతో ఉపాధి పొందుతూ పలువురికి ఉపాధి కల్పించడం లక్ష్యంగా అడుగులు ముందుకు వేస్తున్నారు. మేడ్చల్ మండలంలో ప్రధాన కూడళ్ళలో ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో ట్రెండింగ్ లేటెస్ట్ టీ స్టాల్స్ జనంతో కిటకిటలాడుతాయి. ఆయా టీ స్టాలలో ఉన్న టీ ప్రియులను ఆకర్షించేందుకు ప్రత్యేక గార్డెన్లు ఆడియో వీడియో ఏర్పాట్లు, ఉదయం నుండి సాయంత్రం వరకు పని భారంతో కుటుంబ భారాలతో మానసిక ఒత్తిడితో ఉన్నవారు ఆ టీ స్టాల్స్ లో వెళ్లి కూర్చొని టీ తాగితే చాలు మానసిక ఒత్తిళ్లకు దూరమవుతున్నారని పలుగురు టీ ప్రియులు చెబుతున్నారు.

# వాట్సాప్‌లో ఈ మేసేజ్ వస్తే జాగ్రత్త.!




## వణుకుపుట్టిస్తున్న కొత్త ఆన్‌లైన్ స్కామ్.!

డిజిటల్ యుగం విపరీతంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత తరుణంలో ఆన్‌లైన్ మోసాలు కూడా అంతే రేంజ్‌లో జరుగుతున్నాయి. ఇప్పటికే చాలా సైబర్ మోసగాళ్ల బారినపడి భారీగా నష్టపోయారు.

ఇప్పటికే ఉన్న సైబర్ మోసాలు సరిపోవంటూ.. తాజాగా మరో కొత్త ఆన్‌లైన్ స్కామ్ వెలుగులోకి వచ్చింది. దేశవ్యాప్తంగా ఇది వేగంగా విస్తరిస్తోంది. దాని గురించి తెలుసుకుని.. దాని బారిన పడకుండా ఉండాలంటే ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.. అంతకంటే ముందు అసలు ఆ స్కామ్ ఏంటో చూద్దాం..

నిందితులు టెలిగ్రామ్ బాట్ ద్వారా ఫోన్ నంబర్లు సేకరిస్తారు. ఆ తర్వాత వాట్సాప్ ద్వారా నకిలీ ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్ ఫైల్‌లను పంపడం ద్వారా బాధితులను మోసం చేస్తున్నారు. మొబైల్ అప్లికేషన్‌లను ఇన్‌స్టాల్ చేయడానికి ఈఫైల్‌లను ఉపయోగిస్తారు. ఆ తర్వాత బ్యాంక్ ఖాతా నుంచి డబ్బు దొంగిలిస్తారు. మనకు తెలియకుండానే మన బ్యాంక్ ఖాతాలోని డబ్బు ఖాళీ అయిపోతుంది.

**వీటి నుంచి మనల్ని మనం ఎలా రక్షించుకోవాలి.?**

- వాట్సాప్‌కు ఏపీకే ఫైల్స్ వస్తే వాటిని ఓపెన్ చేయకండి.
- తెలియని సైట్ల నుంచి యాప్‌లను ఎప్పుడూ డౌన్‌లోడ్ చేయవద్దు,
- మీ స్మార్ట్‌ఫోన్‌ను క్రమం తప్పకుండా రీస్టార్ట్ చేస్తూ ఉండండి. ఇది ఏవైనా హానికరమైన ప్రక్రియలను ఆపడానికి, మీ పరికరం సజావుగా పనిచేయడానికి సహాయపడుతుంది.
- మీ బ్యాంక్ ఖాతాలో ఏదైనా అనధికార లావాదేవీలు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినట్లయితే, వెంటనే మీ బ్యాంకుకు నివేదించండి.
- మీరు ఏదైనా ఆన్‌లైన్ నేరం లేదా అనుమానాస్పద కార్యకలాపాలను చూసినట్లయితే, మీరు cybercrime.gov.in లోని నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌కు నివేదించవచ్చు.
- బాధితులు సహాయం కోసం 1930 కు కాల్ చేయవచ్చు. వారు సచార్‌సథి పోర్టల్ ద్వారా సైబర్ క్రైమ్ సెల్‌కు కూడా ఫిర్యాదు చేయవచ్చు, ఇది మీ కేసు పురోగతిని ట్రాక్ చేయడంలో మీకు సహాయపడుతుంది.
- మీ బ్యాంక్ అధికారిక వాట్సాప్ నంబర్ నుండి వస్తున్నట్లు చెప్పుకుంటూ మీకు సందేశాలు లేదా కాల్స్ వస్తే. నిర్ధారించడానికి ఎల్లప్పుడూ మీ బ్యాంక్‌ను వారి అధికారిక సంప్రదింపు వివరాలను ఉపయోగించి నేరుగా సంప్రదించండి.

# వెల్లుల్లి టీతో రక్తపోటు నియంత్రణ

వెల్లుల్లిలో అనేక ఔషధ గుణాలు ఉంటాయన్న సంగతి అందరికీ తెలిసిందే. దాదాపు అధిక శాతం మంది చేసే అన్ని రకాల వంటకాల్లోనూ దీనిని ఉపయోగిస్తూనే ఉంటారు. వెల్లుల్లి వంటలకు రుచిని పెంచడంతో పాటు ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. వెల్లుల్లిలో యాంటీ ఆక్సిడెంట్లతో పాటు అల్లిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. వెల్లుల్లి యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ లక్షణాలను కూడా కలిగి ఉంటుంది. ఇన్ఫెక్షన్ లు దరి చేరకుండా ఉంటాయి. వెల్లుల్లిని తీసుకోవడం వల్ల జీర్ణశక్తి మెరుగుపడుతుంది. శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుంది. ముఖ్యంగా రక్తపోటును అదుపులో ఉంచడంలో వెల్లుల్లి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

## రక్తపోటు అదుపులో..

వెల్లుల్లిని నేరుగా తినలేరు. ఇది చాలా ఘాటుగా ఉంటుంది. కనుక రక్తపోటుతో బాధపడే వారు వెల్లుల్లితో టీ తయారు చేసి తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. రక్తపోటుతో బాధపడే వారికి వెల్లుల్లి టీ ఏ విధంగా సహాయపడుతుందో ఇప్పుడు తెలుసుకుందాం. ధమనుల గోడలపై రక్తం బలం సాధారణం కంటే ఎక్కువగా ఉండే స్థితిని రక్తపోటు అంటారు. అధిక రక్తపోటును అదుపులో ఉంచడం చాలా అవసరం. దీనిని నియంత్రించకపోతే గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వెల్లుల్లిని తీసుకోవడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. వెల్లుల్లిలో ఉండే అల్లిసిన్ రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుందని వైద్యులు చెబుతున్నారు. వెల్లుల్లిలోని సల్ఫర్ రక్తనాళాల్లో నైట్రిక్ఆక్సైడ్ ఉత్పత్తిని పెంచుతుంది. దీంతో రక్తనాళాలు వ్యాకోచించి రక్తపోటు తగ్గుతుంది. ధమనులు గట్టిపడడం, స్ట్రోక్ వంటి ప్రమాదాలు వచ్చే అవకాశం కూడా తగ్గుతుంది.

## ఎలా తయారు చేయాలంటే..

480 మిల్లీగ్రాముల నుండి 960 మిల్లీగ్రాముల మోతాదులో వెల్లుల్లిని తీసుకున్న వారిలో సిస్టోలిక్ రక్తపోటు గణనీయంగా తగ్గిందని నిపుణులు అధ్యయనాల ద్వారా వెల్లడించారు. ఈ విధంగా వెల్లుల్లి రక్తపోటును తగ్గించడంలో ఎంతో సహాయపడుతుందని వైద్యులు చెబుతున్నారు. ఇక వెల్లుల్లి టీని తయారు చేసుకోవడం కూడా చాలా సులభం. దీని కోసం 3 వెల్లుల్లి రెబ్బలు, 3 కప్పుల నీరు తీసుకోవాలి. తరువాత ఒక గిన్నెలో నీరు పోసి అందులో వెల్లుల్లి రెబ్బలను దంచి వేసుకోవాలి. తరువాత ఈ నీటిని 4 నుండి 5 నిమిషాల పాటు మరిగించి స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. తరువాత వడకట్టి అందులో రుచి కోసం తేనె లేదా నిమ్మరసం కలిపి తీసుకోవాలి. ఇలా తీసుకోవడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. అంతేకాకుండా శరీర ఆరోగ్యానికి కూడా మేలు కలుగుతుందని వైద్యులు చెబుతున్నారు.




# కాకర ఆకులతోనూ అనేక లాభాలు

## తరచూ తీసుకోవడం మరిచిపోవద్దు..

చేదుగా ఉండే కాకరకాయలను కూడా మనం ఆహారంలో భాగంగా తీసుకుంటూ ఉంటాం. ఇతర కూరగాయల లాగా కాకరకాయలు కూడా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. అయితే కేవలం కాకరకాయలే కాకుండా కాకరకాయ ఆకులు కూడా మన ఆరోగ్యానికి మేలు చేస్తాయని మీకు తెలుసా.. కాకరకాయల లాగా కాకర ఆకులు కూడా అనేక పోషకాలను, యాంటీ ఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. సాంప్రదాయ వైద్యంలో వీటిని అనేక సమస్యలకు నివారణగా ఉపయోగిస్తారు. కాకర ఆకుల్లో విటమిన్ ఎ, సి, ఫోలేట్, పొటాషియం, ఐరన్ వంటి పోషకాలు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. మధుమేహంతో బాధపడే వారికి ఇవి ఎంతో మేలు చేస్తాయి.

### జీర్ణ సమస్యలకు..

ఈ ఆకుల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. జీర్ణక్రియను మెరుగుపరచడంలో, మలబద్దకాన్ని తగ్గించడంలో ఇవి మనకు ఎంతో సహాయపడతాయి. కాకర ఆకుల్లో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరిగి ఇన్ఫెక్షన్ ల బారిన పడకుండా ఉంటాం. ఈ ఆకుల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టాన్ని తగ్గించడంలో, కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచి చర్మ ఆరోగ్యాన్ని పెంచడంలో ఎంతో సహాయపడతాయి. ఈ ఆకుల్లో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. కనుక వీటిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. తద్వారా బరువు తగ్గడంలో కూడా ఇవి మనకు దోహదపడతాయి. కాకర ఆకులు కాలేయ పనితీరుకు కూడా మద్దతును ఇస్తాయి. శరీరం నుండి వ్యర్థాలను తొలగించడంలో కాలేయానికి ఇవి మద్దతును ఇస్తాయి. తద్వారా శరీర మొత్తం ఆరోగ్యాన్ని కాపాడడంలో ఇవి ఎంతో దోహదం చేస్తాయి.

### ఇలా తీసుకోవచ్చు..

ఇలా అనేక రకాలుగా కాకర ఆకులు మన ఆరోగ్యానికి మేలు చేస్తాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఈ ఆకులతో నేరుగా జ్యూస్ చేసి అందులో నిమ్మరసం కలిపి తీసుకోవచ్చు. అలాగే అరటిపండ్లు, ఆపిల్ పండ్లు వంటి వాటితో కలిపి స్మూతీగా చేసి తీసుకోవచ్చు. కాకర ఆకులు మన ఆరోగ్యానికి మేలు చేసేవే అయినప్పటికీ మధ- ుమేహం ఉన్న వారు వీటిని తీసుకునే విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఈ ఆకులను తీసుకునే ముందు చక్కెర స్థాయిలను పరీక్షించుకోవాలి. ఎందుకంటే కాకరఆకులు చక్కెర స్థాయిలను గణనీయంగా తగ్గిస్తాయి. ఇవి డయాబెటిస్ మందులతో కలిసినప్పుడు చక్కెర స్థాయిలు మరింత తగ్గి హైపోగ్లైసీమియాకు దారి తీసే అవకాశం ఉంది. కనుక వీటిని తీసుకునే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.





# కొత్తగా అలాంటి ఆలోచనలు ఏమీ లేవు

## కొత్తగా సాధించాల్సిందేమీ లేదు

### ఇప్పటికే భారత్ తరపున ఆడాను : భువీ

**సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌కు మళ్లీ జాతీయ జట్టులో అవకాశం ఇవ్వాలనే చర్చ నడుస్తోంది. ఈ వెటరన్ బౌలర్ మాత్రం తనకు అలాంటి ఆలోచనలు ఏమీ లేవని స్పష్టం చేశాడు. ప్రస్తుతం తన జీవితం సాఫీగానే ఉందని వెల్లడించాడు. భువనేశ్వర్ చివరిసారిగా 2022లో భారత్ తరపున ఆడాడు. ప్రస్తుతం ఐపీఎల్‌తోపాటు దేశవాళీలోనే ఆడుతున్నాడు. ఇటీవల ముగిసిన సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండోసారి విజేతగా నిలవడంలో భువీ కీలక పాత్రే పోషించాడు.**



"నేను ఇప్పటికే భారత్ జట్టుకు ఆడాను. ఇంక ప్రత్యేకంగా సాధించాల్సిందేమీ లేదు. మళ్లీ అవకాశం వస్తే గొప్పగా భావిస్తా. కానీ, ఆ అనుభవం ఇప్పటికే ఉంది. ఆటపై ఉన్న ప్రేమే నన్ను నడిపిస్తుంది. క్రమశిక్షణతో ఎలా ఉండాలో నాకు తెలుసు. ఐపీఎల్‌లో ఆడుతున్నా. అలాగే దేశవాళీలోనూ బరిలోకి దిగుతున్నా. గతంలో యూపీ టీ20 లీగ్ ఆడా. ఇప్పుడు నేను చాలా ప్రశాంతంగా ఉన్నా. అందుకు నా ఫ్యామిలీకి క్రెడిట్ ఇవ్వాలి. ఇంట్లో క్రికెట్ గురించి మాట్లాడుకోం. మళ్లీ జాతీయ జట్టుకు వెళ్తే పరిస్థితి ఏంటని ఇప్పటి వరకు చర్చించుకోలేదు. ఎందుకు సెలక్ట్ కాలేదు. నేనేం పొరపాటు చేశాననే విషయాలపై మాట్లాడుకోలేదు. నాకెలాంటి విచారమూ లేదు" అని భువీ తెలిపాడు.

**వారిద్దరితోనే..**

"దేశంలోని యువ బౌలర్లు, బ్యాటర్లకు ఐపీఎల్ మంచి అవకాశాలను కల్పిస్తోంది. వారిని గుర్తించి.. పరిణతి సాధించే వరకూ అండగా నిలుస్తోంది. చాలా మంది నైపుణ్యం ఉన్న పేసర్లను వెలుగులోకి తీసుకొచ్చింది. భారత్‌లోని పిచ్‌లు స్పిన్‌కు సహకరిస్తుండటం ఎప్పట్నుంచో వస్తోంది. ఓవర్సీస్ పిచ్‌లు పేస్‌కు అనుకూలం. విదేశాల్లో భారత్ మెరుగైన ప్రదర్శన చేయడం వెనుక విరాట్ కోహ్లీ, రవిశాస్త్రి పాత్ర కీలకం. టెస్టుల్లో గొప్ప విజయాలను నమోదు చేశాం" అని భువి గుర్తు చేశాడు.

**ప్రవీణ్ కుమార్ ప్రభావం..**

"మాజీ క్రికెటర్ ప్రవీణ్ కుమార్, నేను ఒకే అకాడమీ నుంచి వచ్చాం. నేను అక్కడ జాయిన్ అయ్యేటప్పటికే ప్రవీణ్ స్టేట్ స్థాయి క్రికెట్ ఆడుతున్నాడు. నేను రాష్ట్రస్థాయికి వచ్చేటప్పటికి అతడు టీమ్‌ఇండియాలో సభ్యుడయ్యాడు. మా ఇద్దరి బౌలింగ్ శైలి దాదాపు ఒకేలా ఉంటుంది. అకాడమీలో ప్రవీణ్‌ను ప్రశ్నలు అడగాలంటే కాస్త సిగ్గుపడేవాడిని. అందుకే అతడి బౌలింగ్‌ను ఎక్కువగా అబ్జర్వ్ చేసేవాడిని. ఇప్పుడు అదంతా గుర్తు చేసుకుంటుంటే నేను చాలా లక్కీ అనిపిస్తుంది. యువ క్రికెటర్లకు ఆటపట్ల ప్రేమ ఉండాలి. అప్పుడే సక్సెస్ సాధించేందుకు ఎక్కువ అవకాశం ఉంటుంది" అని భువనేశ్వర్ తెలిపాడు.

---

## శ్రీలంకతో టెస్టు సిరీస్..

# జస్‌ప్రీత్ బుమ్రా దూరం!

శ్రీలంక పర్యటన ముంగిట టీమ్ఇండియాకు భారీ షాక్! సిరీస్‌కు ఎంపికైన ప్రధాన ఫాస్ట్‌బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా గాయం నుంచి ఇంకా పూర్తిస్థాయిలో కోలుకోలేదు. దీంతో అతను ఈ సిరీస్ మొత్తానికి దూరమయ్యే అవకాశముంది. గత నెల ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ మధ్యలో మోకాలి గాయంతో ఇబ్బంది పడ్డ బుమ్రా చివరి మ్యాచ్‌కు దూరమయ్యాడు. గాయం నుంచి కోలుకుంటున్న అతణ్ని శ్రీలంక పర్యటనకు ఎంపిక చేసినప్పటికీ.. ఫిట్‌నెస్ నిరూపించుకుంటేనే మ్యాచ్‌లు ఆడించేలా షరతు పెట్టారు. బుమ్రా బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో ఫిట్‌నెస్ పరీక్ష పాసై లంక పర్యటనకు వెళ్లనున్నట్లు రెండ్రోజుల క్రితం వార్తలొచ్చాయి. అయితే, బుమ్రా మోకాలి వాపు మొదట్లో కనిపించిన దానికంటే తీవ్రంగా ఉందని సమాచారం. రాబోయే రోజుల్లో టీమ్ఇండియా షెడ్యూల్ వరస మ్యాచ్‌లతో చాలా బిజీగా ఉంది. భారత్ ఈ మ్యాచ్‌లు గెలవాలంటే బుమ్రా కీలకం కానున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో రిస్క్ వద్దని సీఓఈలోని స్పోర్ట్స్ సైన్స్ బృందం సూచించినట్లు తెలుస్తోంది. లంకతో టెస్టు సిరీస్ నాటికి అతను ఫిట్‌నెస్ సాధించినా నేరుగా టెస్టు మ్యాచ్‌లు ఆడించడానికి బీసీసీఐ మెడికల్ టీమ్ సందేహం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. బుమ్రా దూరమైతే జమ్మూకశ్మీర్ పేసర్ అకిబ్ నబీ లేదా విదర్భ పేసర్ యశ్ ఠాకూర్‌ను ఎంపిక చేసే అవకాశముంది. భారత్-శ్రీలంక తొలి టెస్టు గాలెలో ఆగస్టు 15న మొదలవుతుంది. 23 నుంచి కొలంబోలో రెండో టెస్టు జరగనుంది.



---

# హార్దిక్ పాండ్య ట్రేడ్‌లో ట్విస్ట్..

## ఎవరితోనూ చర్చించలేదన్న ముంబయి

భారత స్టార్ ఆటగాడు హార్దిక్ పాండ్య ఐపీఎల్‌లో ఫ్రాంచైజీ మారనున్నట్లు కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది. ముంబయి ఇండియన్స్‌కు కెప్టెన్సీ నిర్వర్తించిన అతడిని ఆ జట్టు వదులుకుంటుందనీ.. చెన్నై సూపర్ కింగ్స్‌తో సంప్రదింపులు జరిపిందనే కథనాలూ వచ్చాయి. శివమ్ దూబేతోపాటు మరొకరిని తాము తీసుకుని.. పాండ్యను ట్రేడ్ చేస్తామని ముంబయి ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ముంబయి ఇండియన్స్ నుంచి ఓ కీలక ప్రకటన హాట్ టాపిక్‌గా మారింది. "మేం ఇప్పుడు పోస్ట్ సీజన్ రివ్యూ నిర్వహిస్తున్నాం. అన్ని కోణాల్లో సమీక్షించి నివేదికను సిద్ధం చేసుకుంటాం. ఇప్పటి వరకైతే ఆటగాళ్ల ట్రేడ్‌కు సంబంధించి ఎలాంటి చర్చలు జరగలేదు. ఎవరితోనూ సంప్రదింపులు చేయలేదు. రివ్యూ పూర్తైన తర్వాతనే ట్రేడింగ్ గురించి ఆలోచిస్తాం. అందుకు ఇంకా సమయం పడుతుంది. తొందరపడి ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేం" అని ముంబయి ఇండియన్స్ ప్రతినిధి స్పష్టం చేశారు. గత రెండు సీజన్లలో ముంబయి ఇండియన్స్‌ను నడిపించిన హార్దిక్ పాండ్యకు ఆ జట్టులోని సీనియర్లతో సంబంధాలు తెగిపోయాయనే ప్రచారం జరిగింది. దీంతో హార్దిక్‌ను సారథ్యం నుంచి తప్పించాలనే డిమాండ్‌ను మేనేజ్‌మెంట్ ముందు ఉంచినట్లు తెలుస్తోంది. దీంతో 2027 సీజన్ మెగా వేలానికి ముందే హార్దిక్ విషయంలో ఏదొక నిర్ణయం తీసుకోవాలనే ఆలోచనలో ముంబయి ఇండియన్స్ ఉంది. జట్టులోనూ చాలా మార్పులు చేసే అవకాశం లేకపోలేదు.



---

## కొత్త టీ20 లీగ్‌లో ఆడనున్న

# గిల్, అభిషేక్, అర్ష్‌దీప్




దేశంలో మరో టీ20 లీగ్ పుట్టుకొచ్చింది. అన్ని రాష్ట్రాల మాదిరిగానే త్వరలో పంజాబ్‌లో టీ20 లీగ్‌ను ప్రారంభంకానుంది. ఈ టోర్నీలో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, అర్ష్‌దీప్ సింగ్ వంటి స్టార్ ఆటగాళ్లు బరిలోకి దిగనున్నారు. వీరితోపాటు ఐపీఎల్ ద్వారా గుర్తింపు దక్కించుకున్న గుర్నూర్ బ్రార్, ప్రభ్‌సిమ్రన్ సింగ్, రమణ్‌దీప్ సింగ్ కూడా లీగ్‌లో ఆడతారని పంజాబ్ క్రికెట్ అసోసియేషన్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ టోర్నమెంట్‌కు 'షేర్-ఇ-పంజాబ్ టీ20 లీగ్'గా నామకరణం చేశారు. ఆగస్టు 30 నుంచి సెప్టెంబరు 13 వరకు టోర్నీ జరగనుంది. ఈ లీగ్ అధికారిక లోగోను న్యూ చండీగఢ్‌లోని పీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఆదివారం శుభ్‌మన్ గిల్, అర్ష్‌దీప్ ఆవిష్కరించారు. మొత్తం ఆరు జట్లు అమృత్‌సర్, ఫాజిల్కా, జలంధర్, లూథియానా, మొహాలి, బటిండా పోటీపడనున్నాయి. ఆగస్టు 9న ఆటగాళ్ల వేలం నిర్వహించనున్నారు. శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ యువ క్రికెటర్లు తమ ప్రతిభను ప్రదర్శించడానికి ఈ లీగ్ ఒక అద్భుతమైన వేదిక అని పేర్కొన్నాడు.

"పంజాబ్ ఎల్లప్పుడూ అద్భుతమైన క్రికెటర్లను తయారు చేస్తూనే ఉంది. ఈ లీగ్ ద్వారా ఇంకా చాలా మంది వెలుగులోకి వస్తారని నమ్ము తున్నాను. ఈ టోర్నమెంట్ గొప్ప విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాను" అని గిల్ పేర్కొన్నాడు.

---

# అభిషేక్ శర్మ విధ్వంసం..

## 91 బంతుల్లో 233 రన్స్

భారత క్రికెటర్ అభిషేక్ శర్మ పంజాబ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ వన్డే మ్యాచ్‌లో అదరగొట్టే ప్రదర్శన ఇచ్చాడు. అమృత్‌సర్ సీనియర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన అభిషేక్ (233; 91 బంతుల్లో 15 ఫోర్లు, 25 సిక్సులు) విధ్వంసం సృష్టించాడు. దీంతో మొత్తంగా అమృత్‌సర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 533/8 రన్స్ చేసింది. ఇక, అంతర్జాతీయ క్రికెట్‌లో ఇటీవల అభిషేక్ ఆశించిన మేరకు రాణించలేదు. జింబాబ్వేతో మూడు టీ20ల సిరీస్‌లో కేవలం 11 పరుగులే చేశాడు. అంతకు ముందు ఐర్లాండ్, ఇంగ్లాండ్‌లతో జరిగిన సిరీస్‌ల్లో అభిషేక్ పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. అతను గత 10 ఇన్నింగ్స్‌ల్లో 191 పరుగులు మాత్రమే చేశాడు.





# సంయుక్తా ట్రెడిషనల్ లుక్

మోస్ట్ బ్యూటిఫుల్ అండ్ టాలెంటెడ్ యంగ్ హీరోయిన్ సంయుక్తా మీనన్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఇప్పటికే పలు చిత్రాల్లో నటించి టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. సంయుక్త అఖరుగా బాలకృష్ణ హీరోగా తెరకెక్కిన 'అఖండ 2' చిత్రంలో కనిపించింది. అయితే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. ప్రస్తుతం ఈ భామ నిఖిల్ హీరోగా రూపొందుతున్న 'స్వయంభు' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోంది. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా సంయుక్త సోషల్ మీడియాలో కూడా చాలా యాక్టివ్‌గా ఉంటుంది. ఎప్పటికప్పుడు తనకు సంబంధించిన అందమైన ఫోటోలను అభిమానులతో పంచుకుంటూ ఆకట్టుకుంటోంది. తాజాగా ఈ భామ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో కొన్ని ఫోటోలను షేర్ చేసింది. ఆ ఫోటోల్లో సంయుక్త గోల్డ్ అంచుతో కూడిన ఎరుపు రంగు పట్టు చీరను ధరించింది. దానికి లేత క్రీమ్ రంగు బ్లౌజ్‌ను జత చేసింది. మెడలో భారీ హారం, చెవులకు పెద్ద ఇయర్‌రింగ్స్, ఒక చేతికి బ్రేస్‌లెట్ ధరించి మరింత అందంగా మెరిసింది. అలాగే కురులు ముఖంపై అందంగా పడేలా స్టైల్ చేసుకోవడంతో ఆమె లుక్‌కు ప్రత్యేక ఆకర్షణ వచ్చింది. మొత్తంగా సంయుక్త ట్రెడిషనల్ లుక్ నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటుండగా, ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



# నటనని ఆస్వాదించాలి

"గ్లామర్ నేను చేసే పనిలో ఒక భాగం మాత్రమే కానీ, ప్రేక్షకులు ఎల్లప్పుడూ నా నటనని ఆస్వాదించాలనే కోరుకుంటాన"ని అంటోంది బాలీవుడ్ హీరోయిన్ దిశా పటానీ. త్వరలోనే హాలీవుడ్ సినిమా 'హోలీగార్డ్స్ సాగా- ది పోర్టల్ ఆఫ్ ఫోర్స్'లో జెస్సికా పాత్రతో సినీ ప్రియుల్ని పలకరించనుందీ తార. ఈ నేపథ్యంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఈ సినిమా ప్రయాణంలో కెరీర్ గురించి తెలుసుకున్న పలు ఆసక్తికర సంగతుల్ని పంచుకుంది. "సహజంగానే హాలీవుడ్ ప్రాజెక్ట్‌కి సంబంధించి ఆడిషన్ అవకాశం వచ్చింది. ఇతర ప్రాజెక్టుల్లా ఇది ఎక్కడి నుంచి వస్తోంది, ఎలా ముగుస్తుంది అనే దాని గురించి ఆలోచించకుండా బాగా నటించడంపైనే దృష్టి పెట్టాను. కొత్తగా ఏదైనా ప్రారంభించినప్పుడు ఒత్తిడి సహజం. కానీ, నేను దాన్ని అస్సలు పట్టించుకోను. కేవలం పని చేసే అనుభవాన్ని ఆస్వాదిస్తూ ఆ క్రమంలో వీలైనంత నేర్చుకోవాలని అనుకుంటాను. ఈ సినిమా ప్రయాణంలో ప్రపంచంలోని వివిధ ప్రాంతాల వారితో కలిసి పనిచేసే అవకాశం రావడం, పూర్తిగా భిన్నమైన సినీ నిర్మాణ వాతావరణంలో పనిచేయడం నన్నెంతగానో ఉత్తేజపరిచింది. అలా నన్ను నా కంఫర్ట్ జోన్ నుంచి బయటకు నెట్టింది. అందుకే నాలోని విభిన్నమైన భావోద్వేగాలు, కోణాలను అన్వేషించడానికి వీలు కల్పించే పాత్రలను ఎంచుకోవాలని ప్రయత్నిస్తున్నా" అని చెప్పుకొచ్చింది.



# ఇప్పట్లో పెళ్లి చేసుకునే ఆలోచన లేదు

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ శ్రీగౌరీప్రియ ముందుగా క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించి మంచి ఫేమ్ రాబట్టుకున్నారు. తెలుగులో తొలినాళ్లలో అనుకున్నంత అవకాశాలు రాకపోవడంతో 'లవర్' సినిమాతో కోలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చి తన నటనతో మంచి ఫేమ్ సంపాదించుకుంది. తాజాగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో క్యాస్టింగ్ కౌచ్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. "నేను నమ్మేది ఒకటే.. రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు వస్తాయి. మనిషి అన్నాక పూర్తి క్లారిటీ ఉండాలి, మనకి ఏం కావాలో సరిగ్గా తెలియాలి. అది సరిగ్గా డిసైడ్ అయితే మనల్ని దాటి ఎవరూ ఏమీ చేయలేరు. కెరీర్‌లో ధైర్యం, క్లారిటీ చాలా ముఖ్యం, నాకు ఆ రెండూ ఉన్నాయి" అని స్పష్టం చేసింది. ఇక తన కెరీర్, పెళ్లి గురించి స్పందిస్తూ.. ప్రస్తుతం తన పూర్తి ఫోకస్ నటనపైనే ఉందని, ఇప్పట్లో పెళ్లి చేసుకునే ఆలోచన ఏదీ లేదని, కానీ భవిష్యత్తులో ఖచ్చితంగా చేసుకుంటానని చెప్పింది.

PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com